

న్యూస్ బాక్స్

నేటి నుంచి 17 వరకు రైల్వే గేట్ మూసివేత

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట గ్రామానికి వెళ్లే దారిలోని రైల్వే గేట్ శుక్రవారం నుంచి 17వ తేదీ వరకు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే ట్రాక్ మరమ్మతు దృష్ట్యా గేట్ మూసి వేస్తున్నామని, వాహనదారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు దేవునిపల్లిలో లక్ష్మీనంబులాద్రి స్వామి జాతర

సుల్తానాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): దేవునిపల్లి గ్రామంలోని లక్ష్మీనంబులాద్రి స్వామి జాతర శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ అట్ల కుమారస్వామి, అర్చకులు కొండపాక సతీష్, సంతోష్, లక్ష్మణాచార్యులు, రామాచార్యులు తెలిపారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా వారం రోజులుగా పలు సేవలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రథోత్సవంతో జాతర ముగుస్తుంది. రథోత్సవంలో భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకొంటారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో



పూర్ణచంద్రరావు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాల్వశ్రీరాంపూర్ ఎంపీడీవోగా పూర్ణచంద్రరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన రామ్మోహనచారి పాలకుర్తి మండలానికి బదిలీపై వెళ్లారు.

స్వశక్తి మహిళలకు బీమాతో ధీమా!



పెద్దపల్లి మండలంలో మహిళా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో అవగాహన కల్పిస్తున్న సెర్ప్ సిబ్బంది

- ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు
- శాశ్వత అంగవైకల్యం పొందితే రూ.5 లక్షలు
- లోన్ బీమాతో రూ. 2 లక్షల వరకు మాఫీ
- ఇందిరా మహిళాశక్తి పథకం ద్వారా అమలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

స్వశక్తి సంఘాల మహిళలకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ప్రమాద బీమా, లోన్ బీమా సౌకర్యాన్ని కల్పిస్తోంది. దీనిపై సెర్ప్ సిబ్బంది మహిళా సంఘాలతో నిర్వహించే సమావేశాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ పథకంతో మహిళలకు భరోసా కల్పించినట్లయ్యింది.

మహిళల్లో పొదుపు అలవాటు చేసేందుకు 1992లో అప్పటి కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసింది. 10 నుంచి 15 మంది సభ్యులతో సంఘాలను ఏర్పాటు చేసి వారిచే పొదుపు చేసే విధానాన్ని అలవాటు చేశారు. నెలకు 50 నుంచి 100 రూపాయల వరకు క్రమం తప్పకుండా ఏడాది నుంచి రెండేళ్ల వరకు పొదుపు చేసే డ్వాక్రా సంఘాలను ప్రోత్సహించేందుకు ఒక్కో సంఘానికి రూ.10 వేల చొప్పున సహాయాన్ని అందించారు. ఆ డబ్బులతో సంఘాల మహిళలు స్వయం ఉపాధి పనులు చేసుకునేలా ప్రోత్సహించారు. క్రమంగా మహిళల్లో పొదుపు చేయడం అలవాటుగా మారడంతో ఆ సంఘాల ద్వారా మహిళలు కుటుంబాలనే పోషించే స్థాయికి ఎదిగారు. గ్రామాలే గాకుండా పట్టణాల్లోనూ మహిళా సంఘాలను ఏర్పాటు చేశారు. డ్వాక్రా సంఘాలు కాస్త మహిళా సంఘాలుగా మారాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం గ్యారంటీగా ఉండి బ్యాంకు రుణాలు ఇప్పించింది. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పావలా వడ్డీకే బ్యాంకు లింకేజీ రుణాలను ఇప్పించారు. ఆ తర్వాత 2012లో కిరణ్ కుమార్‌రెడ్డి సీఎం అయిన తర్వాత జీరో వడ్డీకే బ్యాంకు లింకేజీ రుణాలు ఇచ్చారు. రెగ్యులర్‌గా రుణాలు చెల్లించే మహిళా సంఘాలకు ప్రతీ ఆరు మాసాలకోసారి వారి ఖాతాల్లో వడ్డీ సొమ్మును జమ చేశారు. బ్యాంకు రుణాలే గాకుండా శ్రీనిధి బ్యాంకును ప్రభుత్వం ఆరంభించి తద్వారా మహిళలకు వ్యక్తిగతంగా రుణాలు ఇవ్వడం ప్రారంభించారు. ఏదేని కారణంగా రుణాలు పొందిన మహిళలు సాధారణంగా, ప్రమాదవశాత్తు మరణించినా వారు తీసుకున్న రుణాలు మాఫీ అయ్యేవి కావు. తప్పనిసరిగా కుటుంబ సభ్యులు చెల్లించాల్సిందే.

● ఇందిరా మహిళా శక్తి పథకంతో బీమా..

ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లలో మహిళలకు కోటీశ్వరులను చేయాలనే లక్ష్యం పెట్టుకుంది. అందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి పథకాన్ని తీసుకవచ్చింది. ఈ పథకం ద్వారా స్వయం ఉపాధి పనులు చేసుకునేందుకు మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా జీరో వడ్డీకే రుణాలు కల్పిస్తున్నారు. ప్రభుత్వం గ్యారంటీగా ఉంటూ రుణాలు ఇప్పిస్తున్నారు. అలాగే స్వశక్తి సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారందరికీ ప్రమాద బీమా సౌకర్యంతో పాటు రుణాలు పొందిన వారందరికీ లోన్ బీమా సౌకర్యాన్ని కల్పించింది.

● జిల్లాలో ఏర్పాటైన సంఘాలు

జిల్లాలో సెర్ప్, మెప్మా పరిధిలో 19 మండల, పట్టణ సమాఖ్యలు, 668 గ్రామ, స్లమ్ సమాఖ్యలు ఉన్నాయి. వీటి పరిధిలో 16,420 స్వశక్తి మహిళా సంఘాలు ఉండగా, వీటిలో 1,65,778 మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరందరికీ బ్యాంకు లింకేజీ రుణాలు కల్పించారు. రుణాలు తీసుకున్నా, తీసుకోకున్నా స్వశక్తి

మిగతా 8వ పేజీలో...

మైనారిటీ సంక్షేమానికి కృషి చేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 13: ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు హామీ ఇచ్చారు. పట్టణంలోని పారస్ మసీద్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం రాఘవపూర్ గ్రామ శివారులో ఖబ్రస్తాన్ నిర్మాణానికి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత భూమి కేటాయింపు ప్రక్రియ చేపట్టామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఖబ్రస్తాన్, షాదీఖానా, డిగ్రీ కళాశాల, బైపాస్ రోడ్డు, బస్ డిపో ఏర్పాటు చేయాలని కోరారని తెలిపారు. ఖబ్రస్తాన్, బస్ డిపో మంజూరు చేయించినట్లు తెలిపారు. మార్చి తర్వాత పనులు ప్రారంభించనున్నట్లు, అలాగే బైపాస్ రోడ్డు టెండర్లు పూర్తయ్యాయని, మే మొదటి వారంలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని వివరించారు. ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, మున్నా భాయ్,ఎంఏ హై జావిద్,ఎంఏ ఖలీల్,ఆరిఫ్, సయ్యద్ మస్రత్, షాకీర్, ఎంఏ మొయిద్, ఇంతియాజ్ ఖాన్,అంజద్ అలీ, పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేషన్, అంతర్గాం, పాలకుర్తి మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరు గ్యారంటీ పథకాలను ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని, పథకాలు అర్హుకు చేరేలా కృషి చేయాలని సూచించారు. రైతులకు రెండు లక్షల రుణ మాఫీ చేసిందని, రైతు భరోసా ఎకరానికి రూ.6వేలు ఇస్తున్నామన్నారు. పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పరిపాలించిన బీఆర్ఎస్ ప్రజలకు రేషన్‌కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన అందరికి రేషన్‌కార్డు ఇస్తున్నట్టు చెప్పారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చి సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను పూర్తిచేయాలి

ఉద్యోగులతో ముఖాముఖిలో సింగరేణి సీఎండీ బలరాంనాయక్



ఓసీపీ-5లో ఉద్యోగులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న సీఎండీ బలరాంనాయక్

గోదావరిఖని, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను పూర్తి చేయాలని సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం అన్నారు. గురువారం సీఎండీతో పాటు డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కే వెంకటేశ్వర్లు పర్యటించారు. జీడీకే 11ఇంక్లైన్, ఓసీపీ-5లో పర్యటించి ఉద్యోగులతో ముఖాముఖి నిర్వహించారు. సీఎండీ మాట్లాడుతూ ఉద్యోగులకు కేటాయించిన విధులను ఎనిమిది గంటల సమయంలో పూర్తిస్థాయిలో నిర్వర్తించాలని, భారీ యంత్రాల వినియోగం సమయాన్ని పెంచాలన్నారు. వివిధ కేటగిరీలలో పనిచేస్తున్న ఉద్యోగులతో మాట్లాడి వారికి కావలసిన సౌకర్యాలను తెలుసుకున్నారు. వివిధ రకాల యంత్రాలు, విడిభాగాలు పాతవైనా పనులు వెళ్లదీస్తున్నామని, వాటి స్థానంలో నూతన యంత్రాలు ప్రవేశపెట్టాలని సీఎండీకి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన సీఎండీ త్వరలోనే విచారణ చేసి వీటికి సంబంధించిన పనులను త్వరగా చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన 72మిలియన్ టన్నుల ఉత్పత్తి దిశగా ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ప్రతీ ఒక్కరు రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకత దిశగా పని చేయాలని సూచించారు. ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్‌కుమార్, రక్షణ జీఎం కేహెచ్ఎన్ గుప్త, క్వాలిటీ జీఎం డీ బైద్య, ఏజంట్ చిలుక శ్రీనివాస్, ఓసీపీ-5 ప్రాజెక్టు ఆఫీసర్ చంద్రశేఖర్, ఏసీఎంఓ కిరణ్ రాజ్ కుమార్, డీజీఎం (పర్సనల్) కిరణ్ బాబు, అధికారులు డీవీరావు, అంజనేయ ప్రసాద్, ఆంజనేయులు, వరప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, మేనేజర్లు రమేష్ బాబు అనిల్ గబాలే, బీ మల్లేష్, నాయకులు, స్వామి, మడ్డి ఎల్లయ్య, అరెల్లి పోషం, సీనియర్ పీఓ హన్మంతరావు, పాల్గొన్నారు.

ఆసుపత్రి భవన నిర్మాణ పనుల పరిశీలన



పెద్దపల్లి ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న భవనాన్ని గురువారం కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి ప్రాంగణంలో మరో 42 పడకలు ఏర్పాటు చేసేలా భవనాన్ని నిర్మించామన్నారు. నూతన భవనంలోకి డయాలసిస్ యూనిట్ తరలించాల్సి ఉందని, దీని కోసం తగిన స్థలాన్ని కేటాయించాలన్నారు. కలెక్టర్ నిర్మాణ ఏజెన్సీలకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ వాసుదేవ రెడ్డి, అధికారులు, పాల్గొన్నారు.

విద్యుత్ పనులను పూర్తి చేయాలి

అంగన్‌వాడీ కేంద్రాలు, డబుల్ బెడ్ రూం ఇండ్లకు విద్యుత్ సరఫరా పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో విద్యుత్ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చేపట్టిన విద్యుత్ సరఫరా పనులను 3 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో పెండింగ్ ఉన్న 47 అంగన్‌వాడీ కేంద్రాల పనులు 3 రోజులలో పూర్తి కావాలన్నారు. మరో 26 అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేకంగా లైన్ వేసి విద్యుత్ సరఫరా కల్పించాలని, పనులను వారం రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. చందపల్లి, రాంపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు విద్యుత్ సరఫరా పనులు వారం రోజుల వ్యవధిలో పూర్తి చేసి ప్రతీ ఇంటికి విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎస్ఈ మాధవరావు, డీఈ ప్రభాకర్, డీఈ తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.

బాలల సమస్యలపై ఫోన్ చేయాలి

పెద్దపల్లి కల్చరల్, (ఆంధ్రజ్యోతి): బాలల సమస్యలపై ఫిర్యాదులు అందించేందుకు 1098కు ఫోన్ చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో బాలల సంరక్షణ చర్యలపై మహిళాశిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అనాథ పిల్లల వివరాలు సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా అధికారులు సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

జిల్లాలో చట్టవ్యతిరేకంగా శిశువుల దత్తతలు జరగకుండా ఆసుపత్రి సూపరింటెండెంట్‌లతో సమన్వయం చేసుకోవాలని, గ్రామీణా బాలల పరిరక్షణ కమిటీలకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బాలకార్మికులు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని, ఇటుక బట్టీలలో పనిచేసే పిల్లలు గుర్తించి వారికి విద్య అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనాథ పిల్లలను బాల సదనంలో చేర్పించవచ్చని కలెక్టర్ తెలిపారు.

అందుబాటులో రైతులకు సరిపడా యూరియా నిల్వలు

జిల్లా ఏడీఏ శ్రీనాథ్



ఎరువుల దుకాణం తనిఖీచేస్తున్న ఏడీఏ శ్రీనాథ్

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులెవరూ ఆందోళన చెందవద్దని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనాథ్ అన్నారు. గురువారం మండలంలోని కూనారం, వెన్నంపల్లి, శ్రీరాంపూర్, మొట్లపల్లి, మీర్జంపేట గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి యూరియా నిల్వలు ఉన్నాయా లేవా అని తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు యూరియా నిల్వలపై ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అన్ని ఫర్టిలైజర్, డీసీఎంఎస్, సొసైటీ సంఘాల్లో రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారి నాగార్జున, సిబ్బంది ఉన్నారు.

మృతి చెందిన కోళ్లు, మేకలను విక్రయించొద్దు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మటన్, చికెన్ విక్రయదారులు నిబంధనలు పాటించాలని, మృతి చెందిన, వ్యాధులు సంక్రమించిన కోళ్లు, మేకల మాంసాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పలు చికెన్, మటన్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా దుకాణాలలో అపరిశుభ్రంగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తంచేశారు. వ్యర్థాలను నిల్వ చేయకుండా చూడాలని, ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడవద్దని, చుట్టుపక్కల బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. దుర్వాసన రాకుండా, ఈగలు వాలకుండ పరిశుభ్రత పాటించాలని, శుభ్రమైన నీటిని ఉపయోగించాలని సూచించారు. కొందరు యజమానులు చనిపోయిన కోళ్లను, మేకలను కోసి విక్రయిస్తున్నారని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వ్యర్థాలను డ్రైనేజీలలో, రోడ్ల పక్కన పడవేసే వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

రెండు హృదయాల అలజడి ప్రేమ

- ఎన్నెన్నో ఊహలు.. స్పందనలు
- నేడు వాలెంటైన్స్ డే



7

ముగిసిన ఎమ్మెల్సీ నామినేషన్ల ఉపసంహరణ

- పట్టభద్రుల స్థానానికి 56 ఉపాధ్యాయ స్థానానికి 15 మంది పోటీ

6

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) ప్రజా సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తున్నామని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి తాండ్రా సదానందం అధ్యక్షతన గురువారం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అగ్రరాజ్యం అమెరికా భారతీయుల పట్ల అవలంబిస్తున్న విధానాన్ని తప్పుపట్టారు. మోదీ, అదాని, ట్రంప్‌లు ఒకే గొడుగు కింది వారని, ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి మోసం చేయడం వారికి అలవాటేనని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కుల గణనలో పాల్గొనని వారికి మరో అవకాశం కల్పించడం న్యాయబద్ధమేనని, ప్రజా పాలనలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతుబంధు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేసి తమ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తుపై త్వరలోనే విధి విధానాలను ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరపున నిలబడే అభ్యర్థులను గెలిపించుకొని తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వాలను త్వరగా పూర్తిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. గోసిక మోహన్, గౌతమ్ గోవర్ధన్, కడారి సునీల్, కనకరాజ్, మల్లయ్య, స్వామి, ఓదెమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో అడ్డంకులు..



మార్కండేయకాలనీలో నాలాపై ఉన్న నిర్మాణాలు

అధికారుల మధ్య సమన్వయ లోపం ● రెండుగా చీలిన ఇంజనీరింగ్ విభాగం

కోల్‌సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.100 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులకు అడుగడుగునా అడ్డంకులు ఏర్పడుతున్నాయి. నగర రూపురేఖలు మార్చాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పదే పదే అధికారులకు చెబుతున్నా కార్పొరేషన్ ఇంజనీరింగ్ తీరు మారడం లేదు. కలెక్టర్ ప్రత్యేకాధికారిగా ఉండి పనుల్లో వేగం పెంచాలని ఆదేశిస్తున్నా క్షేత్ర స్థాయిలో పనులు సాగడం లేదు. ఇన్‌చార్జి ఎస్ఈ, ఈఈగా కొనసాగుతున్న అధికారికి, మరో ఈఈకి మధ్య ఆధిపత్య పోరు సాగుతున్నట్లు కార్పొరేషన్‌లో చర్చ జరుగుతుంది. పనులను ఇద్దరు అధికారులకు కేటాయించి, పనులు చేయించాలని కలెక్టర్, అదనపు కలెక్టర్ చెబుతున్నా అనుకున్న స్థాయిలో ముందుకు వెళ్లడం లేదు. టెండర్ల ప్రక్రియ పూర్తయి ఆరు నెలలు కావస్తున్నా రూ.20కోట్లకు మించి పనులు సాగలేదంటే పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు.

రామగుండం నగరపాలక సంస్థలో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, డివైడర్లు, జంక్షన్లు, శ్మశాన వాటికల అభివృద్ధి, మంచినీటి పైప్‌లైన్ల పనులు, పండ్ల మార్కెట్, కమ్యూనిటీ హాల్‌ల నిర్మాణానికి నిధులు కేటాయించారు. ప్రజారోగ్య శాఖ ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించి పనులు చేయించే బాధ్యతను కార్పొరేషన్‌కు అప్పగించారు. లక్ష్మీనగర్ వ్యాపార కేంద్రానికి ఎమ్మెల్యే సుమారు రూ.35 కోట్లు మార్కెట్ ఏరియాలోనే కేటాయించారు. రూ.29కోట్లతో లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్‌లలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, రూ.6 కోట్లతో లైటింగ్ తదితర పనులు పెట్టారు. లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్ ప్రాంతాల్లో రోడ్ల వెడల్పు ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. ఈ లోగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వీధి దీపాల పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే, కలెక్టర్ ఆదేశించారు. మంచినీటి పైప్‌లైన్ పనులు కూడా పూర్తి కావాల్సి ఉంది. కానీ పనులు ముందుకు సాగటం లేదు. టెండర్లు పూర్తయినా పనులు చేయించలేని పరిస్థితుల్లో ఇలాంటి వివాదాలు మొదలవుతున్నాయి.

నాలాల అడ్డంకులు తొలగించేవారేరి...

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో నాలాల ఆధునికీకరణ పనులకు సుమారు రూ.15 కోట్లు కేటాయించారు. ఇందులో రెండు ఏజెన్సీలకు నాలాల సైజును బట్టి పనులు అప్పగించారు. పెద్ద నాలా పనులు సిద్ధార్థ డెవలపర్స్‌కు, చిన్న పనులు సుధాకర్ ఇన్‌ఫ్రాకు అప్పగించారు. నగరంలో ప్రధాన నాలాలైన ఇందిరానగర్, మార్కండేయకాలనీ, సప్తగిరికాలనీ, ఐబీకాలనీ నాలాల ఆధునికీకరణ పనులు మొదలుపెట్టారు. ఇందిరానగర్‌లో పనులు పూర్తికాగా రోడ్డు కుడివైపు నుంచి పని మొదలు పెట్టలేదు. నాలా ఆధునికీకరణ పనుల్లో టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల మధ్య సమన్వయ లోపం ఏర్పడింది. ఇందిరానగర్ నుంచి ఆర్కే గార్డెన్ వరకు నాలాకు మార్కింగ్‌లు ఇవ్వలేదు. కృష్ణ మందిరం కింది వైపు నుంచి మార్కండేయకాలనీ ప్రధాన నాలా పనులు నిలిచిపోయాయి. ఈ నాలా పూర్తిగా ఆక్రమణకు

మిగతా 8వ పేజీలో...

చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తీగలగుట్టపల్లి రైల్వేగేట్ వద్ద డిసెంబరు 30న కాలుకు గాయమై కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. మతిస్థిమితం లేని వ్యక్తి భువనగిరికి చెందిన రాజయ్యగా మాత్రమే తెలిసిందని పోలీసులు పేర్కొన్నారు. ఇతర చిరునామా వివరాలు తెలియనందున మృతుడిని గుర్తించిన వారు కరీంనగర్ రూరల్ సీఐ ఫోన్ నంబర్ 8712670764, ఎస్ఐ ఫోన్ నంబర్ 9000884443లో సమాచారం అందించాలని సూచించారు.

మాజీ కార్పొరేటర్‌పై కేసు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వావిలాలపల్లికి చెందిన ఆవుల మధుకర్ ఫిర్యాదుతో కరీంనగర్ మాజీ కార్పొరేటర్ బండారి వేణు, సందబోయిన రాకేష్ అలియాస్ బిట్టు, మరికొందరిపై కేసు నమోదు చేశామని కరీంనగర్ మూడో ఠాణా సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. తన ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి తనతోపాటు కుటుంబ సభ్యులను దూషిస్తూ, దాడికి యత్నించిన మాజీ కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలని మధుకర్ ఫిర్యాదు చేశాడని తెలిపారు. అడ్డుకోబోయిన తన సోదరుడిని కొట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు.

పట్టభద్రుల బరిలో 56 మంది

- 13 మంది నామినేషన్ల ఉపసంహరణ
- ఉపాధ్యాయ స్థానంలో 15 మంది పోటీ
- ముగిసిన ఎమ్మెల్సీ నామినేషన్ల ఉపసంహరణ



కరీంనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల ఉపసంహరణ గురువారంతో ముగిసింది. చివరిరోజు 13 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఉపసంహరణ అనంతరం 71 మంది పోటీలో ఉన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 56 మంది, ఉపాధ్యాయ స్థానానికి 15 మంది పోటీ చేస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో వంద నామినేషన్లు దాఖలు కాగా 32 నామినేషన్లను స్క్రూటినిలో తిరస్కరించారు. పట్టభద్రుల స్థానంలో 13 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఉపాధ్యాయ స్థానానికి 17 నామినేషన్లు వచ్చాయి. వాటిలో ఒక నామినేషన్‌ను స్క్రూటినిలో తిరస్కరించారు. ఒకరు నామినేషన్ ఉపసంహరించుకోగా 15 మంది పోటీలో ఉన్నారు. ఈనెల 27న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలను ప్రకటిస్తారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా చినమైల్ అంజిరెడ్డి, బహుజన సమాజ్‌వాది పార్టీ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణ, ఆలిండియా కిసాన్ జనతా పార్టీ అభ్యర్థిగా లంటు చంద్రశేఖర్, తెలంగాణ ప్రజాశక్తి పార్టీ అభ్యర్థిగా దొడ్ల వెంకటేశం, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా సర్దార్ రవీందర్‌సింగ్, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థిగా బక్క జడ్సన్, ధర్మసమాజ్‌పార్టీ అభ్యర్థిగా మంద జ్యోతి, తెలంగాణ ద్రవిడ ప్రజల పార్టీ అభ్యర్థిగా బొల్లి సుభాష్, నేషనల్ నవ క్రాంతి పార్టీ అభ్యర్థిగా సిలివేరు ఇంద్రగౌడ్ పోటీలో ఉన్నారు. వీరితో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ట్రస్మా రాష్ట్ర మాజీ చైర్మన్ యాదగిరి శేఖర్‌రావు, ముస్తాక్ అలీ, మరో 44 మంది ఇండిపెండెంట్లుగా బరిలో ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా మల్క కొమురయ్య, బహుజన సమాజ్‌పార్టీ అభ్యర్థిగా యాటకారి సాయన్న, దళిత బహుజన్ పార్టీ అభ్యర్థి గవ్వల లక్ష్మి, ఇండిపెండెంట్లుగా వై అశోక్‌కుమార్, కంటె సాయన్న, కూర రఘోత్తంరెడ్డి, చాలిక చంద్రశేఖర్, జగ్గు మల్లారెడ్డి, తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి, మామిడి సుధాకర్‌రెడ్డి, ముత్తారం నర్సింహస్వామి, వంగ మహేందర్‌రెడ్డి, జర్నలిస్టు విక్రమ్‌రెడ్డి వేముల, సిలివేరు శ్రీకాంత్, ఎల్ సుహాసిని పోటీలో ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుల నియామకం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్ పరిశీలకులను నియమించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ఏమైనా ఫిర్యాదులు, సందేహాలుంటే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు పరిశీలకులు సంజయ్‌కుమార్ (సెల్‌నెంబర్ 93984 16403), ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పరిశీలకులు బెన్‌హర్ మహేశ్ దత్ ఎక్కా (నెంబర్ 79937 44287)లో సంప్రదించాలని సూచించారు.

● ప్రచారంపై దృష్టి

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల స్థానాన్ని తిరిగి నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ పార్టీ గట్టిపట్టుదలతో ఉంది. ప్రస్తుతం ఈస్థానానికి కాంగ్రెస్‌కు చెందిన టి జీవన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం పలువురు పోటీపడ్డా పార్టీ రాష్ట్ర నాయకత్వం వి నరేందర్‌రెడ్డిని బరిలో నిలిపింది. నరేందర్‌రెడ్డి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్‌గా ఉత్తర తెలంగాణలో గుర్తింపులో ఉన్న వ్యక్తి కావడంతో బీజేపీ విద్యాసంస్థల అధినేతనే రంగంలోకి దింపింది. చినమైల్ అంజిరెడ్డి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగారు. బీఆర్‌ఎస్ పోటీ చేయకూడదని నిర్ణయించుకోవడంతో ఆపార్టీ టికెట్ ఆశించిన కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. బీఆర్‌ఎస్ టికెట్‌ను ఆశించిన ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు ప్రైవేట్ విద్యాసంస్థల మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ టికెట్ కోసం చివరివరకు ప్రయత్నించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ బహుజన సమాజ్‌పార్టీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. బీజేపీ అభ్యర్థి గెలుపు బాధ్యతను కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ తీసుకున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్‌కు బాధ్యతలు అప్పగించి ఇరుపార్టీలు పోటాపోటీగా పట్టభద్రుల మద్దతు కూడగట్టడానికి వ్యూహాత్మకంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. టికెట్ ఆశించి రెబల్స్‌గా వేరే పార్టీ అభ్యర్థులుగా బరిలో ఉన్న అభ్యర్థులు కూడా ప్రధాన పార్టీలకు సవాల్ విసురుతూ ముమ్మర ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో 3,55,159 ఓట్లు, ఉపాధ్యాయ నియోజకవర్గంలో 28,088 ఓట్లు ఉన్నాయి. 2019లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 1,96,321 ఓట్లు, ఉపాధ్యాయస్థానంలో 23,214 ఓట్లు ఉన్నాయి. పోటీచేయాలని నిర్ణయించుకున్న ఆశావహులు ఓటర్లను పోటాపోటీగా నమోదు చేయించడంతో ఓట్లసంఖ్య గణనీయంగా పెరిగింది.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లి రైల్వేస్టేషన్ పార్కింగ్ స్థలంలో 2024 అక్టోబర్ 4న బైక్‌ను చోరీ చేసిన ఇద్దరిని కరీంనగర్ రూరల్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌కు చెందిన వాస తిరుపతి తన తోటి ఉద్యోగిని రైల్వేస్టేషన్‌లో దించేందుకు బైక్‌పై వెళ్లి పార్కింగ్ స్థలంలో బైక్‌ను పార్క్ చేసి తిరిగి వచ్చేసరికి బైక్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. గురువారం తీగలగుట్టపల్లిలో వాహనాలను తనిఖీ చేస్తుండగా మెట్‌పల్లికి చెందిన షేక్ మదర్(27), పవన్‌కుమార్(35)లు దొంగిలించిన బైక్‌తో పట్టుబడ్డారు. నిందితులు ఇద్దరిని కోర్టులో హాజరుపరచి జడ్జి ఆదేశాలతో జైలులో రిమాండ్‌కు తరలించారు. బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

కారు ఢీకొని గీత కార్మికుడి మృతి

ఓదెల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడకలో గురువారం కారు ఢీ కొని ఇదే గ్రామానికి చెందిన మ్యాడగోని శంకరయ్య గౌడ్ (56) అనే గీత కార్మికుడు మృతిచెందాడు. మడక శివారులోని తాటి చెట్టు ఎక్కేందుకు ద్విచక్ర వాహనంతో వెళ్తున్న క్రమంలో వెనుక వైపునుంచి పొత్కపల్లి వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి ఢీకొనడంతో శంకరయ్య తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసు కున్న కుటుంబసభ్యులు సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే శంకరయ్య మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కారు పొత్కపల్లికి చెందినదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్ఐ రమేష్ తెలిపారు.

కల్లు దొంగతనానికి వచ్చాడని యువకుడిపై దాడి

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగారం గ్రామంలో కల్లు దొంగతనానికి వచ్చాడనే అనుమానంతో గ్రామానికి చెందిన యువకుడు వాసరి భరత్‌కుమార్‌పై స్థానిక గౌడ సంఘం సభ్యులు దాడి చేశారంటూ బాధితులు గురువారం స్థానిక పోలీసులను ఆశ్రయించారు. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని వాసరి లత-శ్రీనివాస్ దంపతుల పెద్ద కొడుకు భరత్‌కుమార్‌కు మతిస్థిమితం లేకపోవడంతోపాటు కళ్లు సరిగా కనిపించవు. ఈనెల 8న ఇంటి నుంచి బయటకు వెళ్లిన భరత్‌కుమార్ స్థానిక కల్లు దుకాణం సమీపంలో రాత్రి 11.30 గంటల సమయంలో కనిపించడంతో కల్లు దొంగిలించేందుకు వచ్చాడని భావించిన గౌడ సంఘం సభ్యులు అతనిపై దాడికి దిగారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు చుట్టుపక్కల వారితో కలిసి అక్కడికి చేరుకుని భరత్‌కుమార్‌ను ఆసుపత్రికి తరలించారు. గౌడ సంఘం సభ్యులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గన్నేరువరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గన్నేరువరం పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లంతకుంట మండలానికి చెందిన కొండి కొప్పుల మహేందర్, మచ్చ మధు మండలంలోని చొక్కారావుపల్లి బిక్కవాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇల్లంతకుంటకు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని పోలీ స్స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని కొండి కొప్పుల మహేందర్, డ్రైవర్ మచ్చ మధుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి



సాయికుమార్ (ఫైల్)

కథలాపూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని పోసానిపేటలో నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన జక్కుల సాయికుమార్ (35) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం పోసానిపేటకు చెందిన ఓ మహిళతో సాయికుమార్‌కు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. వారం రోజుల కిందట అత్తగారింటికి ఓ శుభకార్యం కోసం సాయికుమార్ వచ్చా డు. గత ఆదివారం ఖానాపూర్ వెళ్తున్నానని చెప్పి అత్తగారింటి నుంచి వెళ్లాడు. అక్కడికి చేరుకోకపోవడంతో బంధువులు, కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ తెలియలేదు. గురువారం గ్రామ సమీపంలోని ఓ బావిలో శవమై అనుమానాస్పదంగా కనిపించాడు. సాయికుమార్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లో సొమ్ము పోగొట్టుకుని అప్పులు చేసినట్టు తెలిసింది. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

స్కూటీ అదుపు తప్పి మహిళకు తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలో పడి స్కూటీ గురువారం అదుపుతప్పింది. ఈ సంఘటనలో సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన మహిళ మోడూరి హరిత తీవ్ర గాయాలపాలైంది. క్షతగాత్రురాలిని మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని లక్ష్మీనారాయణ తన భార్య హరితతో కలిసి స్కూటీపై సిరిసిల్ల మీదుగా ఎల్లారెడ్డిపేట వైపు వెళుతున్నాడు. ప్రమాదకరంగా ఉన్న గుంతను గమనించకపోవడం వల్ల అందులో పడి స్కూటీ అదుపు తప్పింది. వెనుక కూర్చున్న హరిత ఎగిరి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి.

హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు

కరీంనగర్ లీగల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమి హద్దుల విషయంలో పెరిగిన వివాదంలో ఒక వ్యక్తిని హత్య చేసిన నేరంలో నిందితులు బోనగిరి ఓదెలు, బోనగిరి జంపయ్యకు జీవిత ఖైదుతో పాటు 2,500 రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి ప్రతిమ గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన రాచమల్ల రామలింగు అతడి కుమారుడు రాచమల్ల సంపత్‌కు గ్రామ శివారులో ఐదెకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉంది. వారి భూమి పక్కనే శంకరపట్నం మండల కేంద్రానికి చెందిన బోనగిరి జంపయ్య, అతడి కుమారుడు బోనగిరి ఓదెలు వ్యవసాయ భూమి ఉంది. ఇరువురి మధ్య భూమి హద్దుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. డిసెంబరు 10, 2020న ఉదయం రాచమల్ల సంపత్ తన వ్యవసాయ భూమి వద్ద ఒంటరిగా ఉండగా జంపయ్య, ఓదెలు గొడ్డలి, రాడ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ సంపత్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు శంకరపట్నం పోలీసులు జంపయ్య, ఓదెలుపై కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ కిరణ్ దర్యాప్తు జరిపారు. కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరు శ్రీరాములు విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రతిమ నిందితులైన ఓదెలు, జంపయ్యకు జీవిత ఖైదుతోపాటు జరిమానా విధించారు.

అక్షర టౌన్‌షిప్, చిట్‌ఫండ్స్ సంస్థ ఆస్తుల జప్తు

- 14.27 కోట్ల అటాచ్‌మెంట్‌కు ప్రభుత్వం ఆదేశాలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలోని అక్షర చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అక్షర టౌన్‌షిప్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలకు చెందిన 14 కోట్ల 27 లక్షల 66 వేల 689 రూపాయల అస్తులను అటాచ్‌మెంట్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేసిందని సీపీ అభిషేక్ మొహంతి ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్షర టౌన్‌షిప్ ప్రైవేట్ లిమి టెడ్ సంస్థ డిపాజిటర్ల ద్వారా అక్రమంగా సంపాదించిన కరీంనగర్ జిల్లాలోని రామడుగు మండలం వెదిర గ్రామంలోని 11 కోట్ల 50 లక్షల విలువైన 50 ఎకరాల భూములు, వెలిచాల గ్రామ పరిధిలోని 2 కోట్ల 70 లక్షల 66 వేల 600 రూపాయల విలువైన సర్వే నెంబరు 129/ఏ, 130/ఏలోని 24,606 చదరపు గజాల స్థిరాస్తులను నిందితులు విక్రయించకుండా అటాచ్‌మెంట్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కరీంనగర్ రాజీవ్‌చౌక్‌లోని అక్షర చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అక్షర టౌన్‌షిప్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అనేక మందిని సభ్యులుగా చేర్చు కుని వారి చిట్ డబ్బులతో పాటు ఇతర డిపాజిట్ డబ్బులకు అధిక వడ్డీ చెల్లిస్తామని చాలా మంది ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల ద్వారా సేకరించిన సొమ్ముతో పలు చోట్ల ఆ సంస్థ భూములు కొనుగోలు చేసి సొంత ఆస్తులను కూడబెట్టుకుంది. సభ్యులు తమ డబ్బులు చెల్లించాలని సంస్థను అడిగితే బాధితులకు డబ్బులు తిరిగి చెల్లించక పోగా అర్థాంతరంగా సంస్థను మూసివేసి సభ్యులను మోసం చేశారు. అక్షర చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అక్షర టౌన్‌షిప్ ప్రైవేట్ లిమి టెడ్ సంస్థ చైర్మన్‌తో సహా ఐదుగురు డైరెక్టర్లు హన్మకొండ వడ్డేపల్లి ఎస్‌బీహెచ్ కాలనీకి చెందిన పేరాల శ్రీనివాసరావు(49), పేరాల శ్రీవిద్య, హన్మకొండకు చెందిన సూరనేని కొండల్‌రావు, పుప్పాల రాజేందర్, అలువల వరప్రసాద్, గోనె రమేష్‌లపై గత ఏడాది ఫిబ్రవరిలో కరీంనగర్ ఒకటో ఠాణాలో పలు సెక్షన్ల కింద ఆరు కేసులు నమోదయ్యాయి. అనంతరం గత ఫిబ్రవరిలో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం జ్యూడీషియల్ కస్టడీ నుంచి నిందితులను పోలీసులు కస్టడీకి తీసుకుని విచారణ అనంతరం అక్షర చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అక్షర టౌన్‌షిప్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు, నిందితుల ఇళ్లలో సోదాలు జరిపి ఆస్తులకు సంబంధించి పత్రాలు, ఆస్తుల వివరాలు సేకరించారు.

తెలంగాణ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ డిపాజిటర్స్ రక్షణ చట్టం, 1999(చట్టం నెంబర్ 19 ఆఫ్ 1999) సెక్షన్ 5 కింద అక్షర చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అక్షర టౌన్‌షిప్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ స్థిరాస్తుల అటాచ్‌మెంట్ చేయాలని గతంలో తెలంగాణ సీఐడీ డీజీపీ ద్వారా కరీంనగర్ పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి ప్రభుత్వాన్ని కోరారు. సీపీ అభ్యర్థన మేరకు కేసు పరిశీలించిన ప్రభుత్వం అక్షర చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అక్షర టౌన్‌షిప్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు డిపాజిటర్స్ చెల్లించిన డబ్బుల ద్వారా అక్రమంగా సంపాదించిన జిల్లాలోని వెదిర గ్రామంలో 11 కోట్ల 50 లక్షల విలువైన 50 ఎకరాల భూములు, వెలిచాలలోని 2 కోట్ల 70 లక్షల 66 వేల 600 రూపాయల విలువైన భూములు, ఆస్తులను నిందితులు విక్రయించేందుకు వీలు లేకుండా జప్తు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నిద్రమత్తులో వ్యాన్ డ్రైవర్

- లారీ, ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన వైనం

- తప్పిన పెనుప్రమాదం



ఆర్టీసీ బస్సును ఢీకొన్న వ్యాన్

మల్యాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నిద్ర మత్తులో ఉన్న డీసీఎం వ్యాన్ డ్రైవర్ ఎదురుగా వస్తున్న రెండు వాహనాలను ఢీకొట్టాడు. వ్యాన్ డ్రైవర్‌కు గాయాలు కాగా మిగతా వారికి పెను ప్రమాదం తప్పింది. మధ్యప్రదేశ్ నుంచి జగిత్యాల మీదుగా విజయవాడకు రిఫ్రిజిరేటర్ల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ డ్రైవర్ నిద్రమత్తులో కరీంనగర్-జగిత్యాల మార్గంలోని మల్యాల క్రాస్ రోడ్డు వద్ద బియ్యం లోడుతో జగిత్యాలకు వస్తున్న లారీని వెనుక వైపు నుంచి ఢీకొట్టాడు. అనంతరం వ్యాను కరీంనగర్ నుంచి వస్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో డీసీఎం వ్యాను ముందు భాగం నుజ్జునుజ్జు కాగా డ్రైవర్ దీపాలీ మీనాకు గాయాలు అయ్యాయి. లారీ వెనుక వైపు, ఆర్టీసీ బస్సు ముందు భాగం దెబ్బతిన్నాయి. అనంతరం రోడ్డుపై నిలిచిన లారీని కారు ఢీకొట్టింది. ప్రయాణికులకు త్రుటిలో ప్రమాదం తప్పగా వాహనాలను క్రేన్ సహాయంతో పోలీసులు రహదారిపై నుంచి తొలగించారు. ఈ ప్రమాదంతో రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోగా పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించి వాహనాలను మల్యాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

నిర్లక్ష్యంగా వాహనం నడిపిన ఒకరికి ఏడాది జైలు శిక్ష

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన ఒకరికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1,100 జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ మెజిస్ట్రేట్ శ్రీనిజ గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మోతె గ్రామానికి చెందిన కల్లెడ సత్తయ్య 2019 నవంబరు 19న అదే గ్రామానికి చెందిన అర్ముల్ల మధుసూదన్‌ను హార్వెస్టర్ మరమ్మతు కోసం తీసుకువచ్చాడు. మరమ్మతు పనులు చేస్తున్న సమయంలో మధుసూదన్ అజాగ్రత్తగా హార్వెస్టర్‌ను అకస్మాతుగా ముందుకు నడిపించాడు. దీంతో సత్తయ్య ఎడమకాలు పైనుంచి హార్వెస్టర్ వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాధితుడు అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ పోలీసులు సాక్ష్యులను జగిత్యాల కోర్టులో గురువారం ప్రవేశ పెట్టారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

అదుపుతప్పి కారు బోల్తా

- తప్పిన పెను ప్రమాదం

మల్యాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. మేడిపల్లి మండలం కాచారం వైపు నుంచి రాంపూర్‌కు వస్తున్న కారు బ్రేకులు పని చేయకపోవడంతో బోల్తా పడి ఒక వైపు వంగినట్లు స్థానికులు తెలిపారు. కారులో ముగ్గురు వ్యక్తులు ఉండగా ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడినట్లు స్థానికులు పేర్కొన్నారు.

రామగుండం ఎన్టీపీసీకి రెండు స్వర్ణశక్తి అవార్డులు



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న ఎన్టీపీసీ సీజీఎం చందన్‌కుమార్

జ్యోతినగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టుకు రెండు స్వర్ణశక్తి అవార్డులు లభించాయి. ఢిల్లీలో గురువారం జరిగిన ఎన్టీపీసీ స్వర్ణశక్తి అవార్డుల కార్యక్రమంలో రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టుకు రాజభాష (హింది) 2023-24 అవార్డుతో పాటు ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ విభాగంలో అవార్డులు లభించాయి. దేశవ్యాప్తంగా ఉన్న ఎన్టీపీసీ ప్రాజెక్టులో వివిధ విభాగాల్లో అత్యున్నతంగా పనిచేసినందుకు యేటా ఎన్టీపీసీ స్వర్ణశక్తి పేరిట అవార్డులను ఇస్తోంది. ఈ మేరకు ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్ చేతుల మీదుగా రామగుండం ప్రాజెక్టు సీజీఎం చందన్‌కుమార్ సమంత అవార్డులను అందుకున్నారు. ప్రాజెక్టు సీజీఎం చందన్‌కుమార్ అధికారులను ఉద్యోగులను అభినందించారు.

ఆర్ట్ గ్యాలరీలో ప్రత్యేక ఆకర్షణగా 'రజని' చిత్రాలు



చిత్రాల వద్ద వైస్ చాన్సలర్ టి గంగాధర్, రజని

మంథని, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో జేఎన్ఏఎఫ్ఏయూ లోని నెహ్రూ గ్యాలరీలో అంజి ఆకొండి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రియేటీవ్ హార్ట్ స్ట్రోక్-4 చిత్రపదర్శనలో మంథనికి చెందిన తమ్ముల రజిని చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 50 మంది పైగా కళాకారులు తమ కళా రూపాలను ప్రదర్శించగా మంథనికి చెందిన తమ్ముల రజని మదర్ ఆఫ్ నేచర్ పేరుతో ప్రదర్శించిన చిత్రాల్లో ఉదయం, సాయంత్రం, రాత్రికి సంబంధించిన ప్రకృతి అందాలను ప్రతిబింబించే విధంగా ప్రదర్శించిన పలు చిత్రాలు నిర్వాహకులను, సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేఎన్ఏఎఫ్ఏయూ వైస్ చాన్సలర్ టి గంగాధర్ ప్రత్యేకంగా రజనిని అభినందించి శాలువాతో సన్మానించారు.

బస్సు ఎక్కుతున్న మహిళ పర్సు చోరీ

- నాలుగు తులాల బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

కోరుట్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో గురువారం ఓ మహిళ బస్సు ఎక్కుతుండగా పర్సులోని నాలుగు తులాల బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురైంది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన వెలిచాల రుచిత మూడు రోజుల క్రితం తన తల్లి గ్రామమైన కథలాపూర్ మండలం తాండ్రాలకు జాతర కోసం వచ్చింది. గురువారం ఆదిలాబాద్ వెళ్లేందుకు రుచిత కోరుట్ల బస్టాండ్‌లో దిగింది. అక్కడ ఆదిలాబాద్ బస్సు ఎక్కుతున్న క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు రుచిత బ్యాగులో ఉన్న పర్సును దొంగిలించారు. రుచిత బస్సు ఎక్కి హ్యాండ్ బ్యాగులో ఉన్న పర్సు కోసం వెతక్కా కనిపించకపోవడంతో బోరున విలపించింది. బాధిత మహిళ ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు. పర్సులో నాలుగు తులాల బంగారు అభరణాలు, రూ.800 నగదు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. కోరుట్ల సీఐ సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఎస్ఐలు శ్రీకాంత్, రాంచంద్రం బస్టాండ్ ప్రాంతంతో పాటు పలు ఏరియాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలించి అనుమానితుల మహిళల ఫొటోలను విడుదల చేశారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు

- అదనంగా పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటుకు చర్యలు
- ఎస్పీ అఖిల్ మహాజన్
- ఆలయ ప్రాంగణం, పార్కింగ్ స్థలాల పరిశీలన



వేములవాడ పట్టణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్, అధికారులు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్‌శాఖ నుంచి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు. వేములవాడ ఆలయప్రాంగణం, పార్కింగ్ ప్రదేశాలు, ఆలయంలోకి వచ్చివెళ్లేదారులు, క్యూలైన్‌లు, కల్యాణకట్ట, ధర్మగుండం, ఆలయ ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లను పోలీస్, ఆలయాధికారులతో కలిసి గురువారం పరిశీలించి సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహాశివరాత్రి వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘనలు జరగకుండా, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గతంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నదని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారి వాహనాల పార్కింగ్ కోసం గత సంవత్సరం కంటే ఎక్కువ పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు చేయాలని సూచించారు. పార్కింగ్ ప్రదేశాల్లో విధుల్లో ఉన్న సిబ్బందికి టెంట్, తాగునీటి సదుపాయాలు కల్పించాలని, పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు త లెత్తకుం డా ట్రాఫిక్ డైవర్షన్ల వద్ద సూచిక బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. శివరాత్రి జాతర సందర్భంగా పటిష్ట భద్రతా చర్యలు చేపడుతామన్నారు. ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల వద్ద, పార్కింగ్ ప్రదేశాల వద్ద, శివార్చన ప్రదేశంలో, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించా రు. ఆయన వెంట ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఈఈ రాజేష్, డీఈ మహిపాల్‌రెడ్డి, ఏఈవో శ్రావణ్‌కుమార్, ఏఈ రామ్‌కిషన్‌రావు, ఎస్ఐ ప్రేమ్‌నందన్ తదితరులు ఉన్నారు.

రెండు హృదయాల అలజడి.. ప్రేమ



- ఎన్నెన్నో ఊహలు.. స్పందనలు
- నేడు వాలెంటైన్స్ డే

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల/కరీంనగర్ కల్చరల్)

ప్రేమ అనే రెండు పదాలు యువతీ యువకుల్లో అలజడిని రేపుతాయి... రెండు హృదయాల్లో ఊహలు... స్పందనలు కలిగిస్తాయి. ప్రేమ మాధుర్యాన్ని, విరహాన్ని నింపుతుంది. వెన్నెల్లో ఊరేగిస్తుంది. నేటి యువత మాత్రం ఫీల్ మై లవ్ అంటూ కొత్త భాషను చెబుతూ తిరుగుతున్నారు. ఒకరి అనుభూతుల్ని మరొకరు పంచుకోవడానికి రెండు హృదయాలను ఒకటి చేసే రోజు వాలెంటైన్స్ డే. ఒకవైపు పాశ్చాత్య సంస్కృతి పోకడలు వద్దంటూ ప్రచారం జరుగుతున్నా యువతీయువకులు మాత్రం ప్రేమికుల దినోత్సవం ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. నగర సంస్కృతి పెరగడంతో ప్రేమతీరు మారింది.



● నేపథ్యం:

క్రీ.శ. 270 సంవత్సరంలో రోమన్ చక్రవర్తి రెండో క్లాడియాన్ దేశంలో సైనికులు పెళ్లిళ్లు చేసుకుంటే ఏకాగ్రతతో యుద్ధం చేయలేరని భావించి పెళ్లిళ్లను నిషేధించారు. వాలెంటైన్ అనే సైనికుడు ఎంతో మంది ప్రేమికులను ప్రోత్సహించి పెళ్లిళ్లు జరిపించాడు. దాన్ని సహించలేని రాజు వాలెంటైన్‌ను ఫిబ్రవరి 14న ఉరితీశాడు. దాంతో ఆ రోజు ప్రేమికుల రోజుగా, వాలెంటైన్స్ డేగా మారింది.

● ప్రేమ బంధాలను కలుపుతున్న సోషల్ మీడియా



గతంలో ప్రేమను తెలపడానికి ఎన్నెన్నో భావాలతో, లేఖలతో తమ అనుబంధాలను పెంచుకునేవారు. ఇప్పుడు సోషల్ మీడియా దూర తీరాల్లో ఉన్నవారి ప్రేమ బంధాలను కలుపతోంది. యువతీయువకులు తమ భావాలను తెలియజేయడానికి సోషల్‌మీడియాను వారధిగా వాడుకుంటున్నారు. గతంలో తమ భావాలు తెలిపేందుకు ఇబ్బంది పడేవారు ఇప్పుడు ఇంటర్నెట్‌ను రొమాంటిక్ ఐడియాస్ అని క్లిక్ చేయగానే ప్రేమికుల రోజున ప్రేమించే వ్యక్తితో సంతోషంగా గడుపుకోవడానికి టిప్స్ ప్రణాళికతో పాటు మరింత గాఢంగా ప్రేమను మలిచే ఆలోచనను అందిస్తుంది. ప్రేమికుల రోజు అనగానే మంచి బ్యాక్‌గ్రౌండ్‌తో కార్డులను పంపాలని అనుకుంటారు. ఇప్పుడు ఇంటర్నెట్‌లోనే పోస్ట్ చేస్తున్నారు. కవితల కోసం లవ్ కోట్స్‌ను క్లిక్ చేస్తే వేల సంఖ్యలోనే కవితలు మీ ముందుకు వాలుతాయి.

సమస్యలు అధిగమిస్తూ ముందుకు..

- జెట్టి వినోద వెంకటేశం, ఇల్లంతకుంట,



కులాంతర ప్రేమ వివాహం చేసుకోవడం వల్ల తలెత్తిన ఇబ్బందులను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నాం. డ్రైవర్‌గా పనిచేస్తున్న కాలంలో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఐదు సంవత్సరాల ప్రేమ అనంతరం 2020లో వివాహం చేసుకున్నాం. కులాంతర వివాహం చేసుకున్నారని కొంతమంది కట్టుబాట్లు విధించారు. వీటన్నింటిని తట్టుకొని కూతురు, కొడుకుతో కలిసి జీవిస్తున్నాం. ప్రేమ వివాహంలో కొన్నిసార్లు సమస్యలు వచ్చినా ఇద్దరు కలిసి పరిష్కరించుకుంటే ఆనందంగా జీవించవచ్చు.

ప్రేమ కంటే జీవితం గొప్పది

- పోకల సుమన్, లావణ్య



ఆకర్షణతో వికసించే ప్రేమ ఆచరణలో వికటిస్తుంది. ఆలోచనలతో పుట్టుకొచ్చే ప్రేమ ఆరు కాలాల పాటు నిలుస్తుంది. ప్రేమించుకున్న ఆ ప్రేమ పెద్దలను ఒప్పించగలిగినప్పుడే సార్థకత చేకూరుతుంది. ప్రేమ కంటే జీవితం గొప్పది. టీనేజ్‌లో ఆకర్షణతో ఏర్పడిన ప్రేమ నిలవదు. పూర్తిగా పరిపూర్ణత సాధించిన తరువాత ఏర్పడే ప్రేమ బంధంగా మారుతుంది. ప్రేమ అని పేరు పెట్టుకొని మైనర్లు, బంధం వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రేమ ఆత్మీయత, అనుబంధాలను కోరుకోవాలి. అలాంటప్పుడే సరైన భాగస్వామ్యం లభిస్తుంది.

సంతోషంగా ఉన్నాం

- గంగం స్వరూపరాణి మహేష్, మాజీ ఎంపీపీ, రుద్రంగి



రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మేము డిగ్రీ చదువు పూర్తి అయిన తరువాత 2009లో సింహాచలం లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రేమ వివాహం చేసుకున్నాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇద్దరం అర్థం చేసుకొని ఎలాంటి అభిప్రాయ భేదాలు లేకుండా సంతోషంగా జీవిస్తున్నాం. మా రెండు కుటంబాలతో కలిసి మెలిసి సంతోషంగా ఉంటున్నాం. బాబు, పాపతో జీవితాన్ని సాఫీగా సాగిస్తున్నాం.

తొలి చూపులోనే ప్రేమలో పడ్డా

-కాంగ్రెస్ నేత జువ్వాడి నర్సింగరావు-రజిని



చుట్టం చూపుగా వెళ్లి తొలి చూపులోనే రజినితో ప్రేమలో పడ్డా. మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు బంధువైన రజినిని తొలిసారి 1986లో హైదరాబాద్‌లో చూసి ఇష్టపడ్డాను. పెద్దలతో మాట్లాడి 1987 పెళ్లి చేసుకొని ఒక్కటయ్యాం. మాకు ఇద్దరు అమ్మాయిలు కాగా పెద్ద కూతురు రితిమాది కూడా ప్రేమ వివాహమే. గత ఏడాది ప్రేమికుల రోజుకు గుర్తుగా ఫిబ్రవరి 14న రితిమ-రోహన్‌ల వివాహం చేశాం.

-మెట్‌పల్లి టౌన్

పెద్దలను ఒప్పించి ప్రేమ పెళ్లి

- మాజీ జడ్పీటీసీ చొప్పరి లత-సదానందం



కులాలు వేరైనా కుటుంబ సభ్యులను ఒప్పించి పెద్దల సమక్షంలో ఏకమయ్యారు లత సదానందం. స్వగ్రామం కేశనపల్లి కాగా వీరి తండ్రులు సింగరేణి ఉద్యోగులు కావడంతో వెంకట్రావుపల్లిలో ఉన్నారు. అక్కడ ఒకే వీధిలో ఉండడంతో వారి మధ్య ప్రేమ చిగురించింది. 1995లో ఇరు కుటుంబాల పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నారు. అనంతరం సదానందం రాజకీయాల్లో రాణిస్తుండగా లత గృహిణిగా అతనికి అండగా నిలుస్తోంది. 1999కి ముందు తెలుగుదేశం పార్టీలో ఉండగా అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి మంత్రి శ్రీధర్‌బాబు అనుచరుడిగా ఉన్నారు. 2006లో కేశనపల్లి సర్పంచ్‌గా, 2014లో ముత్తారం జడ్పీటీసీగా పని చేశారు. ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా కొనసాగున్నాడు. ఒకరినొకరు అర్థం చేసుకుని ముందుకు సాగుతున్నారు.

- ముత్తారం

కష్టసుఖాల్లో.. ఒకరికి ఒకరుగా..

రాజ్‌ఠాకూర్ మక్కాన్,మనాలీ ఠాకూర్, రామగుండం ఎమ్మెల్యే



మాది లవ్ ఎట్ ఫస్ట్ సైట్.. ఓ ఫంక్షన్‌లో పరిచయమయ్యాము. అది ప్రేమ.. తర్వాత పెళ్లి వరకు వెళ్లింది. మాది ఐదేళ్ల ప్రేమ.. పెద్దలకు ఈ విషయం తెలిపి ఒప్పించి పెళ్లి చేసుకున్నాం. పెళ్లి తర్వాత ఒకరికొకరుగా జీవిస్తున్నాం. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా ఉంటున్నాం. ఒకరం రాజకీయాల్లో బిజీగా ఉంటే మరొకరం కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తున్నాం. సమయం లభించినప్పుడు కుటుంబంతో గడుపుతాం. విజయాలు సాధించినప్పుడు, ఇబ్బందులు ఎదురైనప్పుడు ఒకేలా ఉంటాం. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటున్నాం. మా ప్రేమనే మాకు బలం.. బలహీనత. రాజకీయాల్లో ఉన్నప్పుడు కుటుంబానికి సమయం కేటాయించకపోయినా.. అర్థం చేసుకుని ముందుకుసాగుతాం.

- గోదావరిఖని

'ఎస్‌ఆర్‌ఆర్' డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ (ఎస్‌ఆర్‌ఆర్) అటానమస్ కళాశాల డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె రామకృష్ణ, శాతవాహన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శ్రీరంగ ప్రసాద్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్, అధ్యాపకుల బృందంతో కలిసి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ మాట్లాడుతూ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్, బీఎస్సీ హానర్స్, బీసీఏ బీబీఏ మొదలైన కోర్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ మాట్లాడుతూ మొదటి సెమిస్టర్‌లో 1,346 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 521 మంది విద్యార్థులు 38.7 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కళాశాల వెబ్‌సైట్‌లో ఫలితాలను చూసుకోవచ్చని తెలిపారు.

ఎస్‌యూ డిగ్రీ పరీక్షల ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నవంబర్ 2024లో నిర్వహించిన డిగ్రీ సెమిస్టర్ 1,2,3,4,5,6వ సెమిస్టర్ల ఫలితాలను గురువారం శాతవాహన విశ్వవిద్యా లయం పరీక్షల నియంత్రణ అధికారి, డాక్టర్ ఎన్వీ శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. ఈ ఫలితాలను శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.in అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ప్రమాదకరంగా అడవిసోమన్‌పల్లి వంతెన



వంతెనపై ఏర్పడ్డ గుంతలు

మంథని రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మంథని మండలం అడవిసోమన్‌పల్లి గ్రామ శివారులోని మానేరు నదిపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో పాటు సైడ్‌లో ఉన్న సెక్యూరిటీ రెయిలింగ్ దెబ్బతిన్నది. 1973లో అప్పటి ఎమ్మెల్యే పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ వంతెనను నిర్మించారు. భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల రవాణా వ్యవస్థలకు మానేరు నదిపై వారధిగా ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతోపాటు వంతెన మధ్యలో భాగంలో పలుచోట్ల పగుళ్లు తేలింది. లారీ ఢీకొనడంతో ఆరు నెలల క్రితం సైడ్ రెయిలింగ్ సైతం కూలిపోయింది. రెండు జిల్లాలకు వారధిగా ఉన్న వంతెన నిత్యం వందలాది వాహనాలు వెళుతుంటాయి. వాహనదారులు భయంభయంగా ప్రయాణం సాగిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రయాణికులు, వాహన దారులు కోరుతున్నారు.



వంతెన వద్ద కూలిన రెయిలింగ్

కులగణనపై బీజేపీ, బీఆర్‌ఎస్ చిత్తశుద్ధిని చాటుకోవాలి

- బండి సంజయ్‌కు చేతనైతే దేశవ్యాప్తంగా కులగణన కోసం కృషి చేయాలి - మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కులగణనపై శాసనసభలో బిల్లు చేసి కేంద్రానికి పంపిస్తామని, బీజేపీ, బీఆర్‌ఎస్ బలహీన వర్గాలపై చిత్తశుద్ధి ఉంటే ఈ బిల్లుకు మద్దతివ్వాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం డీసీసీ కార్యాలయంలో మాట్లాడుతూ తెలంగాణలో 56 శాతం బీసీలు ఉన్నారని, 46 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి చట్టబద్ధత కల్పించనున్నట్లు తెలిపారు. దీనిని అడ్డుకోవడానికి ప్రభుత్వం చెప్పే లెక్కలు తప్పని, బలహీనవర్గాలను అవమానించే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కులగణనలో తెలంగాణ రోల్ మోడల్‌గా నిలించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగిని పంపి కోటి 15 లక్షల కుటుంబాలకు సర్వే చేయగా కోటి 12 లక్షల కుటుంబాలు తమ సమాచారాన్ని స్వచ్ఛందంగా ఇచ్చాయన్నారు. సర్వేకు స్పందించని దాదాపు 3.1 శాతంలో కొంత మంది తమ సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్త చేశారని, వారికి మళ్లీ అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఫిబ్రవరి 16 నుంచి 28వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే సర్వేను సమాచారం ఇవ్వని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కొంతమంది బీఆర్‌ఎస్ నేతలు దీనిని రీ సర్వే అంటున్నారనీ, ఇది రీ సర్వే కాదు.. ఎవరైతే సర్వేలో మిస్సయ్యారో, సర్వేలో సమాచారం ఇవ్వలేదో వారికి మరో అవకాశం ఇస్తున్నామన్నారు. మార్చి మొదటి వారంలో కేబినెట్ సమావేశం ఏర్పాటుచేసి, తర్వాత ప్రత్యేక శాసనసభ సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. 42 శాతం స్థానిక సంస్థల్లో, విద్యా, ఉపాధి అవకాశాల్లో బలహీనవర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలనే సంకల్పంతో చట్టబద్ధత తెచ్చే కార్యాచరణ తీసుకున్నామన్నారు. దీనికి అందరూ సహకరించాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతంలో చేపట్టిన సమగ్రకుటుంబ సర్వేకు చట్టబద్ధత లేదని, ఆ సర్వే నివేదికను కేబినెట్‌లో, శాసనసభలో పెట్టలేదని విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పక్కన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నాయకులు

కులగణనపై బీఆర్‌ఎస్‌కు చిత్తశుద్ధి ఉంటే ఇప్పుడు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలందరికీ పార్టీ తరపున విజ్ఞప్తి చేయాలన్నారు. బీజేపీకి వారికి జనాభాకి అనుగుణంగా బీసీ, ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేదని, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి చేతనైతే కులగణనను దేశవ్యాప్తంగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రక్రియ దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిందన్నారు. రాష్ట్రప్రభుత్వం చట్టబద్ధంగా శాసనసభ అభిప్రాయంతో పాటు తీర్మానాన్ని ప్రవేశపెడతామన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడడం వల్ల కేంద్రం నుంచి నిధులు రావని, ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరించి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూస్తామని తెలిపారు. సమావేశంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఎండీ తాజ్, వైద్యుల అంజన్‌కుమార్, సిరాజ్ హుస్సేన్, పులి ఆంజనేయులుగౌడ్, గడ్డం విలాస్‌రెడ్డి, ఆకారపు భాస్కర్‌రెడ్డి, ముత్యం శంకర్, బుచ్చిరెడ్డి, మాచర్ల ప్రసాద్, సరిల్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాబితాపూర్‌లో అగ్నిప్రమాదం

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జాబితాపూర్ గ్రామానికి చెందిన ఆదే మోహన్, ఆదే రాజేందర్‌కు చెందిన పశువుల పాకకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోగా అందులోని ఆవు, గడ్డి మోపులు అగ్నికి ఆహుతయ్యాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వెంటనే వచ్చి మంటలు ఆర్పివేశారు. ఘటనా స్థలాన్ని ఎస్సై సధాకర్ పరిశీలించారు.

విద్యుత్‌శాఖ ఆర్టిజన్ ఉద్యోగిపై కేసు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగి కాంరెడ్డి వెంకటసాయిపై కేసు నమోదు చేశామని కరీంనగర్ మూడో ఠాణా సీఐ జాన్‌రెడ్డి గురువారం తెలిపారు. ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీసు ఠాణాలో పనిచేస్తున్న వెంకటసాయి విధులకు గైర్హాజరు వుండటంతో అతన్ని ఎస్‌ఐ కార్యాలయానికి సరెండర్ చేశారని, దీంతో గురువారం సీఐ, ఎస్‌ఐ, సిబ్బందిపై దురుసుగా ప్రవర్తిస్తూ వారి విధులను అడ్డుకుని, బెదిరింపులకు పాల్పడ్డాడని ట్రాన్స్‌కో విజిలెన్స్ ఎస్‌ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం మేడిగడ్డకు మరమ్మతులు చేపట్టాలి

- రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాలి - మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో బాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారెజ్ మరమ్మతును రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్ల పట్టణం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడారు. రైతులు వేసిన యాసంగి నాట్లు ఇప్పుడే పచ్చబడుతున్నాయని వాటిని కాపుడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గోదావరి నది జలాలను ఎత్తిపోతల ద్వారా తప్ప తెలంగాణకు వేరే గత్యంతరం లేదన్నారు. ఎస్సారెస్పీ కాకతీయ కెనాల్, వరద కాలువల ద్వారా ఎల్‌ఎండీ నుంచి కాకతీయ కెనాల్ ద్వారా సూర్యాపేట వరకు నీరు వెళ్తుందన్నారు. ఈ కాలువల ద్వారా సరిగా నీళ్ల రావడం లేదనే తెలంగాణ వచ్చిన వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించుకున్నా మన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల ప్రాజెక్టులను కట్టి ఎల్లంపల్లి ప్రాజెక్టు నింపి ఎత్తిపోతల ద్వారా నీటినిపైకి గ్రావిటీ కెనాల్ ద్వారా, ఎత్తిపోతల ద్వారా మిడ్ మానేరుకు తీసుకొచ్చామన్నారు. మిడ్ మానేరు ద్వారా రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ ద్వారా ఉత్తర తెలంగాణ జిల్లాలకు నీరు ఇచ్చే ఆలోచనతో కేసీఆర్ కాళ్లేశ్వరం ప్రాజెక్టును నిర్మించారన్నారు. మేడిగడ్డ వద్ద ఒక బ్లాక్ కుంగితే దాన్ని రేవంత్‌రెడ్డి రాజకీయం చేశాడని, దాదాపు 14నెలలు గడుస్తున్నా మేడిగడ్డ బ్లాక్ మరమ్మతులను చేపట్టలేదని ఆరోపించారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ చేతుల్లో ఉందని రేవంత్‌రెడ్డి, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ వారు తాము సూచనలు ఇచ్చేవారిమి మాత్రమే.. డ్యాం మరమ్మతులు యజమాని మాత్రమే చేసుకోవాలని చెబుతున్నారన్నారు. తాము చెబితే వినకుండా, కేసీఆర్‌ను బదనాం చేశారని ఆరోపించారు. ఎన్నికల్లో బదనాం చేసి గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి మరమ్మతులు చేసే బాధ్యతను తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు

గంబీరావుపేట, తంగళ్లపల్లి రైతులు నీటి కోసం ధర్నాలు చేస్తున్నారని ఆరోపించారు. చివరి తడికి నీరు అందుతుందో లేదోనని యాసంగి పంటకు పెట్టుబడి పెట్టడానికి రైతులు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేడిగడ్డను ముట్టుకోకుండా కూడా నీళ్లను తీసుకురావచ్చన్నారు. ఇటీవల నందిమేడారం నుంచి నీళ్ల ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కాళ్లేశ్వరం మోటార్లు ఆన్ చేస్తేనే మిడ్ మానేరు నిండిందన్నారు. 80శాతం కాళేశ్వరం ప్రాజెక్టును ఉపయోగిస్తున్నారని, కేవలం బ్యారేజీల నుంచి ఎత్తిపోతలను ఆపారని అన్నారు. మేడిగడ్డ వద్ద మరమ్మతులు చేపట్టి నీరు సముద్రం పాలు కాకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం వద్ద నీరు కిందికి పోకుండా లిఫ్ట్ చేసి అన్నారం సుందిల్ల, ఎల్లంపల్లి నింపి మార్చి, ఏప్రిల్ నెల వరకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు గజభీంకార్ రాజన్న, న్యాలకొండ రాఘవరెడ్డి, కుంబాల మల్లారెడ్డి, బొల్లి రామ్మోహన్, చంద్రయ్యగౌడ్, మధు, యాదగిరి, పడిగెల రాజు, వెంకటరమణరావు పాల్గొన్నారు.

ప్రొఫెషనల్ కోర్సులతో..

కామర్స్ విద్యార్థులకు అపార అవకాశాలు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): డిగ్రీతో పాటు సీఏ, సీఎంఏ, సీఎస్ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసిన కామర్స్ విద్యార్థులకు ప్రస్తుత వ్యాపార, పారిశ్రామి క రంగాల్లో అత్యున్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని మస్కట్‌లోని మ్యాజిస్ టెక్నాలజీ సర్వీసెస్ సంస్థకు చెంది న కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ (సీఎంఏ) ప్రభాకర్ తెలిపారు. ఎస్‌ఆర్‌ఆర్ అటానమస్ కళాశాలలోని కామర్స్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం వారు ఏర్పాటు చేసిన కెరియర్ గైడెన్స్ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామర్స్ బీబీఏ విద్యార్థులు డిగ్రీతో పాటు చార్టెడ్ అకౌంటెన్సీ, కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ కంపెనీ సెక్రటరీస్ వంటి ప్రొఫెషనల్ కోర్సులను అధ్యయనం చేయవచ్చన్నారు. ఈ కోర్సులను పూర్తి చేసిన వారికి భారతదేశంతో పాటు ఇతర దేశాలలో మంచి వేతనంతో కూడిన ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆచార్య కే రామకృష్ణ మాట్లాడుతూ ఎస్సారార్ ఆర్ట్స్ కళాశాలలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వారి చాప్టర్ ఉందని దీనిని డిగ్రీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, కామర్స్ విభాగాధిపతి టి రాజయ్య, డాక్టర్ ఎం మల్లారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పారక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో పడి వృద్ధురాలి మృతి

ఎలిగేడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన పొన్నం కనకమ్మ(78)అనే వృద్ధురాలు ఎస్సారెస్పీ డి-86 ప్రధాన కాలువలో పడి మృతి చెందింది. ఎస్సై సనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలి భర్త కొమురయ్య 30 ఏళ్ల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి ముగ్గురు పిల్లలను పెంచి పెద్దచేసింది. మూడేళ్ల నుంచి మతిస్థిమితం కోల్పోయింది. గురువారం మధ్యాహ్నం శివారులోని ఎస్సారెస్పీ కాలువ గట్టుపై తిరుగుతూ కాలువలో పడిపోయింది. ప్రభుత్వ పాఠశాల పీఈటీ కొండ తిరుపతి కాపాడేందుకు యత్నించారు. అయినా ఫలితం లేకుండాపోయింది. మృతురాలు కనకమ్మ కుమారుడు పొన్నం మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలి



మంథనిలో ఆర్పీలతో మాట్లాడుతున్న కమిషనర్ మనోహర్

సుల్తానాబాద్, ఫిబ్రవరి 13: (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల ద్వారా సభ్యులు పొందిన బ్యాంకు రుణాలను మార్చి 31లోగా తిరిగి చెల్లించే విధంగా కృషి చేయాలని మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ స్వరూప అన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో గురువారం పట్టణ మెప్మా ప్రతినిధులతో సమావేశం జరిగింది. సీవో మాట్లాడుతు బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించి కొత్త రుణాలు పొందాలన్నారు. రుణాలు పొందిన వారు సకాలంలో చెల్లించకపోవడంతో భవిష్యత్తులో రుణాలు పొందడానికి అర్హత ఉండదన్నారు. ప్రతీనెల వాయిదాల పద్ధతిలో చెల్లించి తిరిగి రుణం పొందడానికి అర్హత కలిగి ఉండాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్‌తోపాటు మెప్మా ఆర్పీలు, ఓబీలు పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): కొత్త సంఘాల ఏర్పాటుతో పేద మహిళలకు ఆర్థికాభివృద్ధి కల్పించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.మనోహర్, శ్రీనిధి డీసీఎం సతీష్‌బాబు, ఆర్ఎం దుర్గాప్రసాద్‌లు సూచించారు. గురువారం వారు ఆర్పీలతో సమీక్షిస్తూ పట్టణ సమాఖ్య పరిధిలో ఉన్న స్వశక్తి సంఘాలకు శ్రీనిధి రుణాలు తక్కువ వడ్డీకి ఇస్తున్నామని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్‌జీ ఎస్‌ల బకాయిలు వంద శాతం వసూలు చేయాలన్నారు. కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. లావణ్య, శోభ, ఆర్పీలు పాల్గొన్నారు.

ఆలయ మాజీ చైర్మన్‌కు సన్మానం

ఓదెల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భ్రమరాంభ మల్లికార్జునస్వామి ఆలయంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మేకల మల్లేశంను గురువారం సన్మానించారు. మద్రాస్‌లో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మల్లేశం చేసిన సేవా కార్యక్రమాలు గుర్తించి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ మాజీ సభ్యులు మల్లేశం సేవలను గుర్తు చేస్తూ మల్లికార్జునస్వామి ఆలయం వద్ద సన్మానించారు. ఆరెల్లి మొండయ్య, కనికిరెడ్డి సతీష్, మ్యాడగోని శ్రీకాంత్, బత్తుల రమేష్, చింత మొగిలి, రాపర్తి మల్లేశం, వెంకటస్వామి, కర్రె కుమారస్వామి పాల్గొన్నారు.

రైతులకు సరిపడా ఎరువులు

ముత్తారం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు గ్రామాల రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి అనూష అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఏవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఇబ్బందులు పడోద్దని, సరిపడ ఎరువులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అధికారులు, డీలర్లు ఉన్నారు.

దళితులను మోసం చేసిన పార్టీలు



ఓదెలలో ర్యాలీని నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఓదెల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించే ఎస్సీ ల వర్గీకరణ చేపట్టామని తెలిపారు. ఇన్నాళ్లుగా పార్టీలు దళితులను మోసం చేస్తున్నాయన్నారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం అనంతరం ఎస్సీల వర్గీకరణ అవుతుందని, దీనికి ఇన్నాళ్ళుగా ఏ పార్టీ సాహసం చేయలేదన్నారు. సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శంకర్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు కొమురయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ కుమారస్వామి, మాజీ సర్పంచులు రాజు, బొంగోని రాజయ్య గౌడ్, ఆకుల మహేందర్, గుండేటి ఐలయ్య, బండారి రాజ్ కుమార్, కోట నిరంజన్ రెడ్డి, వంగ రవీందర్, రెడ్డి రజినీకాంత్, రాజమల్లు, తాళ్లపల్లి సదయ్య పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ కవచాల పై శిక్షణ

పాలకుర్తి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని పుట్నూరులో గురువారం గౌడ కులస్తులకు కాటమయ్య రక్షణ కవచాల వాడకంపై శిక్షణ ఇచ్చారు. శిక్షకులు మూల మల్లేషం, అంజయ్య లు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రక్షణ కవచాల పై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, ప్రమాదాల నివారణకు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. ఎక్సైజ్ ఎస్ఐ మంద శ్రీనివాస్, గౌడ సంఘం నాయకులు గొల్లపల్లి సతీష్‌గౌడ్, నిమ్మల నారాయణగౌడ్, ఎక్సైజ్ సిబ్బంది రఘు కుమార్, శ్రావణ్ కుమార్, రాజు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ఎలిగేడు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాకల్‌దేవ్‌పల్లి, రాములపల్లి శివారులో గల అయ్యావారికుంట భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ మాజీ సర్పంచ్ అన్నమనేని రఘుపతిరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఎలిగేడు రెవెన్యూ కార్యాలయంలో భూఆక్రమణలపై తహసీల్దార్ ఎండి.బషీరోద్దీన్‌కు ఫిర్యాదు చేశారు. అయ్యావారిపల్లి కుంట భూములను సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన వేణుమాధవ్ ఇండస్ట్రీ మేనేజింగ్ పార్ట్నర్ అన్నమనేని దేవేందర్‌రావు, ఎ.మనోహర్‌రావులు కుంట మధ్యలో నుంచి రోడ్డు నిర్మాణం చేశారని పేర్కొన్నారు. జయశంకర్ ఇండస్ట్రీస్‌కు నీటి అవసర నిమిత్తం మాధవరావు ఎఫ్‌టీఎల్ పరిధిలో వ్యవసాయ బావి తవ్వించి, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ తీసుకొని రైస్‌మిల్లులకు వాడుకుంటున్నాడని తెలిపారు. ఆకుల మల్లయ్య అనే వ్యక్తి శిఖంలో ఒక ఎకరం ఆక్రమించుకొని వరిపంటను సాగుచేశాడని పేర్కొన్నారు. దీనిపై గత అక్టోబర్ 28న ఫిర్యాదు చేశానన్నారు. రెవెన్యూ అధికారులు విచారణ జరిపి ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ధారించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అర్హులందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపచేయాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

పాలకుర్తి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వేమునూరు గ్రామం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ముంపునకు గురైందని, గ్రామానికి చెందిన అర్హులందరికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింప చేయాలని గురువారం ఆర్డీవో గంగయ్యకు వినతిపత్రం అందించారు. గ్రామస్థులు మాట్లాడుతూ బుధవారం పంచాయితీ నోటీసు బోర్డుపై ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి 13 మందిని మాత్రమే ఎంపిక చేశారని, 250 మంది అర్హత ఉన్నా జాబితాలో చేర్చలేదన్నారు. మరోసారి జాబితాను పరిశీలించి అర్హులందరికి న్యాయం చేయాలని ఆర్డీఓను కోరినట్లు తెలిపారు.

బహుజనులకు న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీనే



విలేకరుల సమావేశంలో మాటాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బహుజనులకు న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీనేనని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన కుల గణన సర్వే చారిత్రాత్మకమని అన్నారు. బహుజనులకు న్యాయం జరుగాలని కోరుకుంటున్నామన్నారు. కులగణన సర్వేను చూసి బీజేపీ, బీఆర్ఎస్‌లు గగ్గోలు పెడుతూ బీసీలపై కపట ప్రేమను ప్రదర్శిస్తుందన్నారు. కులగణనలో తప్పిదాలు ఉంటే చెప్పాలని ముఖ్యమంత్రి ప్రతిపక్షాల సలహాలు తీసుకున్నారన్నారు. బీజేపీలో ఓసీలు, బీఆర్ఎస్‌లో దొరలు బహుజనులను అణిచివేయడానికి ప్రయత్నం చేస్తున్నారని, గతంలో బీఆర్ఎస్ పార్టీ బహుజనులను గేటు బయట ఉంచిన చరిత్ర వారిదన్నారు. వచ్చే ఎన్నికల్లో 42శాతం బీసీలకు రిజర్వేషన్ కేటాయిస్తామన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తరువాత దేశంలో ఏ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణపై తీర్మానం చేయలేదన్నారు. బహుజనులకు, దళితులకు న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. మాజీ మేయర్ బంగి అనీల్ కుమార్, నాయకులు కల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, పెద్దెల్లి తేజస్విని ప్రకాష్, కొలిపాక సుజాత, ముస్తాఫా, తిప్పారపు శ్రీనివాస్, పెండ్యాల మహేష్, గుండేటి రాజేష్, బాల రాజ్‌కుమార్, గడ్డం శ్రీనివాస్, యుగంధర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మక్కాన్‌సింగ్ సేవాసమితి చైర్మన్ మనాలి ఠాకూర్ పర్యటించారు. ఉపాధిహామీ, వ్యవసాయ కూలీలను, రైతులను కలిసి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు ప్రజా పాలన అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు. మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు మేరుగు అశోక్ తదితరులతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని త్వరగా గుర్తించాలి



పండ్లు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో ప్రసన్న కుమారి

ముత్తారం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే అంగవైకల్యం రాకుండా ఉంటుందని జిల్లా వైద్యాధికారి అన్నా ప్రసన్నా కుమారి అన్నారు. గురువారం మండల కేంద్రం లో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా అవగాహన కార్య క్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని కుష్టు వ్యాధిగ్రస్తులకు చెద్దర్లు, బెడ్ షీట్స్ , పండ్లు పంపిణీ చేశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కుష్టు వ్యాధి సామాన్యమైన అంటువ్యాధని, చికిత్స ద్వారా పూర్తిగా నయం అవుతుందన్నారు. ఈ వ్యాధి మైకో బాక్టీరియం లేప్రే అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తి చెందుతుందని, త్వరగా గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చన్నారు. చర్మం పైన స్పర్శ లేని రాగి రంగులో లేదా గోధుమ రంగులో మచ్చలు ఉంటే పీహెచ్‌సీలో సంప్రదించాలని సూచించారు. 2027 నాటికి కుష్టు వ్యాధి రహిత దేశంగా ఏర్పరచడానికి ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ కిరణ్ కుమార్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమరేందర్‌రావు, డిపిఎమ్‌ఓలు సువార్త, రమేష్, దేవి సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో గురువారం కుష్టువ్యాధిపై కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పిహెచ్ఎస్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కుష్టువ్యాధిపై విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, ఏఎన్ఎం సరోజన, ఆశాకార్యకర్త శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వశక్తి మహిళలకు బీమాతో ధీమా!

(5వ పేజీ తరువాయి)

సంఘంలో సభ్యురాలిగా ఉంటూ రెగ్యులర్‌గా పొదుపు చేస్తున్న వారందరికీ ప్రభుత్వం రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించింది. ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే బీమా చెల్లించనున్నారు. శాశ్వత అంగవైకల్యం ఉంటే రూ.5 లక్షలు ఇవ్వనున్నారు. రుణాలు పొందిన వాళ్ల సహజ మరణం పొందినా, ప్రమాదశాత్తు మరణించినా లోన్ బీమా కింద వారు బ్యాంకు లింకేజీ కింద తీసుకున్న రుణం రూ.5 వేల నుంచి 2 లక్షల రూపాయల వరకు ప్రభుత్వం సంబంధిత బ్యాంకుకు చెల్లిస్తుంది. ఈ పథకాన్ని శ్రీనిధి బ్యాంకు అమలు చేస్తున్నది. మరణించిన వాళ్ల సంఘ సభ్యురాలై ఉండాలి, వారి బ్యాంకు ఖాతా పుస్తకం, సంఘంలో సభ్య రాలైనట్లు సంఘం తీర్మానం కాపీ, మరణ ధ్రువీకరణ పత్రం, ఎఫ్ఐఆర్, తదితర ధ్రువీ కరణ పత్రాలు సెర్ప్ సిబ్బందికి ఇవ్వాల్సి ఉంటుంది. అంగవైకల్యం పొందిన వాళ్ల 50 శాతం అంగవైకల్యం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందని శ్రీనిధి బ్యాంకు ఆర్ఎం దుర్గాప్రసాద్ తెలిపారు. లోన్ బీమా ద్వారా రుణాలు పొందిన వాళ్ల చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని 2 లక్షల వరకు సంబంధిత బ్యాంకుకు ప్రభుత్వమే చెల్లిస్తుంది. జిల్లాలో ఇప్పటి వరకు 80 మంది వరకు మహిళలు మృతి చెందారని, ఇందులో 12 మంది ప్రమాదవశాత్తు మరణించారని, వీరికి సంబంధించిన డాక్యుమెంట్లను ప్రభుత్వానికి పంపిస్తున్నామని దుర్గాప్రసాద్ తెలిపారు. ప్రమాద, లోన్ బీమాలు తమకు ఎంతగానో భరోసా కల్పిస్తున్నాయని మహిళలు చెబుతున్నారు.

అభివృద్ధి పనుల్లో అడ్డంకులు...

(5వ పేజీ తరువాయి)

గురైంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం 66అడుగులు ఉండాల్సిన నాలా కొన్ని చోట్ల పది పదిహేను అడుగులకు కుచించుకుపోయింది. ఎనిమిది నిర్మాణాలు నాలాలోనే ఉన్నాయి. సైట్ క్లియరెన్స్ ఇవ్వాల్సిందిగా కాంట్రాక్టర్లు అడిగితే మరోచోట మొదలు పెట్టాలని సూచించినట్లు తెలుస్తుంది. దీంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. గాంధీనగర్ నుండి ప్రారం భించాల్సిన నాలా పనులు కూడా మొదలు కాలేదు.

పండ్ల మార్కెట్ నిర్మాణానికి సంబంధించి టెండర్ల ప్రక్రియ నెల రోజుల క్రితమే పూర్తయింది. సింగిల్ టెండర్ రావడంతో పెండింగ్‌లో పెట్టారు. నిబంధన ప్రకారం ఈఎన్‌సీ ఒపీనియన్ తీసుకొని టెండర్ ఫైనల్ చేయాల్సి ఉంది. జంక్షన్ అభి వృద్ధికి రెండు కోట్లు కేటాయించారు. ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్, మున్సిపల్ జంక్షన్, బీ పవర్‌హౌస్ కూడలి అభి వృద్ధికి ప్రణాళిక చేస్తున్నారు. గోదావరిఖని కూరగా యల మార్కెట్‌లో అభివృద్ధి పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయినా పనులు మొదలు కాలేదు. ఇప్పటికే పాత మున్సిపల్ ఆఫీస్ కాంప్లెక్స్, ఓల్డ్ అశోక థియేటర్ స్థలం తదితర ప్రాంతాల్లో అభివృద్ధికి ప్రణాళికలు చేస్తున్నారు. ఉన్న పనులు పూర్తయితే కానీ ఇతర పనులపై యంత్రాంగం దృష్టి సారించేందుకు అవకాశం ఉండదు. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో యంత్రాంగం సమన్వయంతో పని చేస్తేనే అడ్డంకులు తొలగిపోయే అవకాశం ఉంది. దీనిపై కార్పొరేషన్ ప్రత్యేకాధికారి, కలెక్టర్ పూర్తిస్థాయి దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

ఆంగ్లభాషా దినోత్సవం

ఎలిగేడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం సరోజినినాయుడు జయంతిని ఆంగ్లభాషా దినోత్సవంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి ఆంగ్లభాషా ప్రాముఖ్యతను వివరించారు. మహోన్నత వ్యక్తులుగా రాణించడమే లక్ష్యంగా పెట్టుకొని చదువుకోవాలని హెచ్ఎం గంధ్ర దేవేందర్‌రావు అన్నారు. ఆంగ్లభాషా ఉపాధ్యాయులు ప్రేమలత, సీఆర్‌పీ లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూలపల్లి, కమాన్‌పూర్ మండలంలోని సరోజినినాయుడు జయంతిని పురస్కరించుకొని ఆంగ్లభాషా దినోత్సం నిర్వహించారు. విద్యార్థులు అంగ్ల వ్యాకరణ రంగోలి ఉపన్యాస పోటీలు, వ్యాసరచనపోటీలు నిర్వహించారు. గైడ్ టీచర్ నాగరాజు, ఇంచార్జీ హెడ్మాస్టర్ గంగారం, శిరోమణి, శ్రీనివాస్, శ్రీదేవి, వేణుగోపాల తదితరలు పాల్గొన్నారు.

ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధిగా రాజేందర్‌కుమార్



కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మహా జన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా అంతర్గాం మండలం కుందనపల్లి గ్రామం అక్బర్ నగర్‌కు చెందిన కొండల రాజేందర్‌కుమార్‌మాదిగ నియమితులయ్యారు. మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఎంఎస్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడు రుద్రారాపు రాంచందర్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు మంథని చందుమాదిగ ఒక ప్రకటనలో తెలిపారు. రాజేందర్‌కుమార్ 15 ఏళ్ళుగా మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో పనిచేస్తూ ఎస్సీ వర్గీకర ణ కోసం పనిచేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ కెమెరాలతోనే నేరాల నియంత్రణ

ఓదెల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణ సీసీ కెమెరాల తోనే సాధ్యమవుతుందని పొత్కపల్లి ఎస్సై రమేష్ తెలిపారు. పొత్కపల్లిలో గురువారం గ్రామస్థులతో కమ్యూనిటీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ, సీసీ కెమెరాల ఉపయోగం, సైబర్ క్రైమ్, షీ టీం ఉపయోగం, 100 డయల్, బాల్యవివాహాలు, గంజాయి మత్తు పదార్థాల నియంత్రణ తదితర వాటిపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఒక వ్యక్తి చెడు వ్యసనాలకు అలవాటు పడితే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్నేహితులు, ఎప్పటికప్పుడు వారిలో వస్తున్న మార్పులను గుర్తించినట్లయితే వాటి నుంచి కాపాడవచ్చన్నారు. గంజాయి, మత్తు పదార్థాల వినియోగం అధికంగా ఉంటుందని, దీనిని సామాజిక సమస్యగా పరిగణించి నివారణకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని, గంజాయి విక్రయాల సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

సహకార సంఘం ద్వారా రైతులకు రూ.40 కోట్ల రుణాలు



సమావేశంలో పాల్గొన్న చైర్మన్, డైరెక్టర్లు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రైతులకు అందిస్తున్న రుణాలు, సేవలతో సహకార సంఘం రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచిందని, రాష్ట్రంలో ద్వితీయ బహుమతి సాధించిందని సుల్తానాబాద్ సహకార సంఘం చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ అన్నారు. చివరి పాలకవర్గ సమావేశం గురువారం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ తమ సంఘం ద్వారా ప్రతి వ్యవసాయ సీజన్లో 40 కోట్ల పైచిలుకు వివిధ రకాల రుణాలను రైతులకు అందించామన్నారు. రెండు కోట్ల 76లక్షల 99 వేల 453 రూపాయల సభ్యుల షేర్ క్యాపిటల్ కలిగి ఉన్న సంఘంలో దాదాపు రెండు కోట్ల డిపాజిట్లు ఉన్నాయని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తద్వారా రైతుల నుంచి ప్రతీ సీజన్లో 21 కోట్ల రూపాయల మేరకు వ్యాపారం చేశామని వివరించారు. సీఈవో బూరుగు సంతోష్, డైరెక్టర్లు గాజుల రాజమల్లు, రాములు, సురేష్ రెడ్డి, రాజయ్య ,గణేష్, గోపాల్, ఓదెలు, తెలుకుంట సుగుణాకర్ ,త్యాగాసి లచ్చయ్య ,గళ్ళ పద్మ, కమలమ్మ ,పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు బట్టి చదువుకు స్వస్తి చెప్పాలి

ధర్మారం ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బట్టి చదువుకు స్వస్తి చెప్పి విషయాన్ని అర్థం చేసుకోవాలని ఎంఈవో బోతు ప్రభాకర్ అన్నారు. గురువారం ధర్మారం ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్‌శెట్టి ఆధ్వర్యంలో విద్యార్థులకు మోటివేషన్, ధ్యానం క్లాసుల నిర్వహణ కార్యక్రమంలో మాట్లాడారు. పాఠశాలలోని 41 మంది 10వ, తరగతి విద్యార్థులకు గురూజీ డిల్లేశ్వర్‌రెడ్డిచే క్లాసులు నిర్వహించారు. లయన్స్ క్లబ్ సభ్యులు విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న 9వ, తరగతి విద్యార్థికి క్లబ్ సభ్యులు ఆర్థిక సహాయం అందించారు. ఆమెకు అవసరమైన టెస్టులు, వైద్యుల చేత చికిత్స అందేలా కృషి చేస్తానని లయన్స్ క్లబ్ జోన్ చైర్మెన్ డాక్టర్ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. తన్నీరు రాజేందర్, ఎండి ముజాయిద్, కట్ట రమేష్, మిట్టపల్లి చంద్రకాంత్‌రెడ్డి, రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాలతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లు పెంచాలి

కమాన్‌పూర్, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): గుండారం, కమాన్‌పూర్ గ్రామాల్లో ఓటర్లు అధికంగా ఉన్నందున కమాన్‌పూర్‌లో 2, గుండారంలో 2పోలింగ్ స్టేషన్‌లను పెంచాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లారపు అరుణ్‌కుమార్ వినతిపత్రాన్ని అందించారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో 700కు పైగా ఓటర్లు ఉంటే ఓట్లు వేసే క్రమంలో సమయం ఎక్కువ అవుతుందని, స్టేషన్‌లు పెంచితే త్వరగా ఓటు వేసే అవకాశం కల్పించవచ్చని ఆయన పేర్కొన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీల నాయకులతో మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు సమావేశం నిర్వహించారు. డ్రాఫ్ట్ పోలింగ్‌స్టేషన్లు, ఓటరు లిస్టుపై చర్చించారు. ఎంపీవో అనిల్‌రెడ్డి, నాయకులు మహేష్, కొమురయ్య, రామస్వామి, సంపత్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధి శిబిరం

ధర్మారం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): టీబీ నిక్షయ్ శివిర్ కార్యక్రమం ఈ నెల 27 వరకు నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ గౌతమ్, డాక్టర్ సుష్మ తెలిపారు. వైద్య సిబ్బంది అను మానితుల గుర్తించి తెమడను సేకరించి పరీ క్షకు పంపిస్తున్నామన్నారు. టీబీ పాజిటివ్ వచ్చిన వారికి చికిత్స అందిస్తే వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. మేడారం, శాయంపేట ర్యాలీ నిర్వహించారు. తిరుపతి, నరసింహారెడ్డి, విజయ, లలిత, మృనాలిని పాల్గొన్నారు.

రేపటి నుంచి బాలబాలికల కబడ్డీ పోటీలు

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 15 శనివారం కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి గుజ్జుల కరుణాకర్‌రెడ్డి తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 9గంటలకు ఒరిజనల్ ఆధార్‌కార్డుతో హాజరుకావాలని, బాలురు 55కేజీల బరువు, బాలికలు 55 బరువు ఉండాలన్నారు. పోటీలలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20తేదీ నుంచి 23వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారని అన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం

మంథని, ఫిబ్రవరి 13: ఇటీవల మృతి చెందిన గురువు కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయాన్ని చేశారు. మున్సిపల్ పరిధిలోని కూచిరాజ్‌పల్లిలో తమకు చదువు చెప్పిన గురువు అంబటి ధనుంజయ్ ఇటీవల మృతి చెందగా ఆయన దశదిన కర్మ రోజు వందన స్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన సీఎండి

గోదావరిఖని, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 జీఎం కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహానికి గురువారం సింగరేణి సీఎండీ బలరాంనాయక్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాట ఓదెలు, ఏరియా ఉపాధ్యక్షుడు జనగామ నర్సయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎండీ మాట్లాడుతూ, సింగరేణిలో ఎక్కడ లేని విధంగా అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై అధికారులను, అసోసియేషన్ నాయకులను అభినందించారు. అనంతరం డైరెక్టర్లు కే వెంకటేశ్వర్లు, పీఎల్ సూర్యనారాయణ బాబా సాహెబ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, ఆరెపల్లి రామచందర్, బడికెల కృష్ణ, పులిమోహన్, ఆకునూరి రాజశేఖర్, ఉమేందర్, సురేష్ బాబు, అంకుల్, పసుల రాయలింగు, పాల్గొన్నారు.

ఓసీపీ-1 సమస్యలపై సీఎండీకి వినతి

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-1కు వచ్చిన సీఎండీ బలరాంకు ఐఎన్‌టీయూసీ నాయకులు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ప్రాజెక్టు ఆవరణలో అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని కోరారు. ఓసీపీ-1 ఉద్యోగులకు ఇన్‌సెంటివ్ ఇప్పించాలని, ఉద్యోగులకు నష్టం జరిగేలా ఉన్న ఎస్-1, ఎస్-2 పద్ధతిని రద్దు చేయాలని కోరారు. కొత్త గ్రైడర్లు, ట్యాంకర్ల అవసరం ఉన్నదని తెలిపారు. ఉద్యోగ విరమణ రోజే రావాల్సి న ఆర్థిక ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. ఆర్జీ-3 వైస్ ప్రెసిడెంట్ రవీందర్‌రెడ్డి, సెంట్రల్ సెక్రెటరీ గడ్డం తిరుపతి, నాయకులు శ్రీనివాసరావు, కొలిపాక సారయ్య, సదానందం, ప్రభాకర్‌రెడ్డి, ప్రవీణ్, దామోదర్‌రావు ఉన్నారు.

బొగ్గు నాణ్యతకు పెద్దపీట వేయాలి : సీఎండీ



రికార్డులను పరిశీలిస్తున్న సీఅండ్ఎండి, ఓసీపీ-3 ఉద్యోగులతో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

రామగిరి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బొగ్గు నాణ్యతకు పెద్దపీట వేయాలని సింగరేణి సీఎండి బలరాంనాయక్ స్పష్టం చేశారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా నిర్వహిస్తున్న కార్మిక చైతన్యయాత్ర పర్యటనలో భాగంగా ఆర్జీ-3, ఏపిఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పి, ఓసిపి-2లలో పర్యటించారు. ఏపిఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పి కార్యాలయంలో ఉత్పత్తికి సంబంధించి రికార్డులను పరిశీలించారు. బొగ్గు నాణ్యతకు ప్రాధాన్యంపై అధికారులకు సూచించారు. అనంతరం ఓసిపి-2లో వ్యూపాయింట్ ద్వారా పనులను పరిశీలించారు. యంత్రాల పనిగంటలు పెంచాలని అధికారులకు సూచించారు. సింగరేణిలో మహిళా శక్తిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటామని ప్రకటించారు. ప్రైవేట్ బొగ్గు ఉత్పత్తి సంస్థలకు తీసిపోకుండా నాణ్యమైన ఉత్పత్తిని సాధించినప్పుడే సంస్థ మనుగడ, కార్మికుల సంక్షేమంతో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని సూచించారు. డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సూర్యనారయణ, ఆర్జీ-3 జీఎం సూర్యనారయణ, ప్రాజెక్టు అధికారులు నాగేశ్వర్‌రావు, వెంకటరమణ, నాయకులు కొటరవీందర్‌రెడ్డి, ఎంఆర్‌సి రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు తమకు కేటాయించిన విధులను ఎనిమిది గంటలు విధి నిర్వహణకే కేటాయించాలని సీఎండీ ఎన్ బలరాం సూచించారు. ఓసీపీ-3 ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. సీఎండీ మాట్లాడుతూ పని గంటలు వృథా కాకుండా జాగ్రత్త వహించాలని, భారీ యంత్రాల వినియోగ సమయాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఓసీపీ-3కి కేటాయించిన వార్షిక లక్ష్యాన్ని సాధించే దిశగా సమిష్టి కృషి తో పని చేయాలని సూచించారు. నైపుణ్యత, అనుభవం గల ఉద్యోగులు, ప్రాజెక్టు అవరాలకు ఉపయోగపడే యంత్ర శక్తి ఓసీపీ-3కి ఉన్నాయని, పని తీరు మెరుపుపరుచుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉన్నట్టు బలరాం అభిప్రాయపడ్డారు. రక్షణ, ఉత్పత్తి మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై ఉద్యోగుల నుండి అభిప్రాయాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. జీఎం బండి వెంకటయ్య, ఆర్జీ రీజియన్ సేఫ్టీ జీఎం గుప్తా, రీజియన్ క్వాలిటీ జీఎం బైద్యా, ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ రాజ్‌కుమార్, సీఎంఓఏఐ జనరల్ సెక్రెటరీ నర్సింహులు, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ రవీందర్ పాల్గొన్నారు.